# తిరిగొచ్చిన బిల్లుతోనైనా తీరుమారేనా?

కలాం చర్యతో కళ్లు తెరవాలి!

జయప్రకాష్ నారాయణ్

June 5, Bhavishyat Bharatam 2006

లాభదాయక పదవులపై కొంతకాలంగా రేగుతున్న వివాదం ఆసక్తికరమైన మలుపు తిరిగింది. అవసరమైన మినహాయింపులన్నింటితో రాష్ట్రపతి ఆమోదానికి పంపిన లాభదాయక పదవుల సవరణ బిల్లును పునఃపరిశీలించమంటూ ఆయన ప్రభుత్వానికి తిప్పి పంపడంతో ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గడచిన మార్చిలో జయాబచ్చన్‌పై అనర్హత వేటు పడింది మొదలు జోడు పదవుల వివాదంలో అనేకానేక కోణాలు వెలికివస్తున్నాయి. వీటన్నింటినీ కూలంకషంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

బిల్లును ప్రభుత్వానికి తిప్పి పంపడంలోని ఔచిత్యాన్ని కొన్ని ప్రసార సాధనాలు ప్రశ్నించాయి. రాష్ట్రపతికి ఉద్దేశాలను అంటగట్టడం, బిల్లును తిప్పి పంపడంలో ఆయన అధికారాన్ని ప్రశ్నించడం సమంజసం కాదు. రాజ్యాంగబద్ధ పదవిలోని వ్యక్తి, మరీ ముఖ్యంగా రాష్ట్రపతి స్థానంలో ఉన్న వ్యక్తి తీసుకున్న ఏ నిర్ణయాన్నయినా సానుకూలాంశాల ప్రాతిపదికగానే పరిశీలించాల్సి ఉంటుంది. రాజకీయ దృక్కోణంలో ఆ నిర్ణయాలను విశ్లేషించడం సబబు కాదు. బిల్లును పునఃపరిశీలించాలంటూ తిప్పి పంపే హక్కు రాష్ట్రపతికి రాజ్యాంగంలోని 111 అధికరణ ప్రకారం సంక్రమించింది. ఈ హక్కును గతంలోనూ కొందరు రాష్ట్రపతులు ఉపయోగించుకున్నారు. జ్ఞాని జైల్‌సింగ్, వెంకటరామన్‌లు బిల్లులను ప్రభుత్వానికి తిప్పి పంపారు. ఆ రెండు సందర్భాల్లోనూ ప్రభుత్వాలు రాష్ట్రపతి నిర్ణయాన్ని శిరసావహించి మిన్నకున్నాయి. కానీ, బీహార్‌లో 74వ అధికరణ కింద రాష్ట్రపతి పాలన విధించాలంటూ గతంలో మంత్రి మండలి చేసిన విజ్ఞప్తిని కలాం తోసిపుచ్చకపోవడం విమర్శలకు కారణమైంది. ఆ విమర్శల్లో హేతుబద్ధత ఉందనే చెప్పాలి.

## రాష్ట్రపతి సూచనలపై చర్చ

లాభసాటి పదవుల సవరణ బిల్లును పునఃపరిశీలనకు పంపుతూ రాష్ట్రపతి అందుకు మూడు కారణాలను చూపారు. వాటిని సాకల్యంగా చర్చించాల్సిన అవసరం ఉంది. సభ్యుల అనర్హతలన్నింటికీ మినహాయింపులిస్తూ 1959 నుంచీ బిల్లును వర్తింపజేయాలనడంలోని ఔచిత్యాన్ని ఆయన ప్రశ్నించారు. రెండోది- సభ్యుడికోరకంగా విధానాలను మార్చివేస్తూ, ఎప్పటికయ్యది చందంగా వ్యవహరించే విధానానికి స్వస్తి పలకాలని ఆయన అభిప్రాయపడ్డారు. సభ్యులను అనర్హత వేటునుంచి మినహాయించే విధానంలో హేతుబద్ధత అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. మూడోది- లాభదాయక పదవులపై కేంద్ర, రాష్ట్రాలకు వర్తించే సమగ్ర చట్టం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ఏ చట్టాన్నీ పాత తేదీలనుంచి అమలు చేయరు. కానీ ఇందుకు కొన్ని మినహాయింపులూ లేకపోలేదు. ఉదాహరణకు 1951 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని అనర్హత అంశాన్ని తొలగించడంకోసం 1975లో సవరణలు తీసుకొచ్చారు. చట్టానికి సవరణలు చేసి, పాత తేదీనుంచి దాన్ని వర్తింపజేయడం ద్వారా- పార్లమెంటు సభ్యులు పదవీచ్యుతులు కాకుండా అడ్డుకోవడం ప్రభుత్వ ప్రస్తుత లక్ష్యంగా కనిపిస్తోంది. పార్లమెంటు సభ్యత్వంతోపాటు లాభదాయక పదవులను నిర్వహిస్తున్న వారి సంఖ్య సుమారు 40కి పైగానే ఉంది. పాత తేదీనుంచి అమలయ్యే విధంగా బిల్లు తీసుకురాని పక్షంలో వీరందరూ సభ్యత్వాలను కోల్పోవాల్సి ఉంటుంది. వీరందరి పదవులను కాపాడాలన్న ఆలోచనను అర్థం చేసుకోవచ్చుగానీ- అందుకోసం

చట్టాన్ని 1959 నుంచి వర్తింపజేయడంలోని ఔచిత్యం మాత్రం అంతుపట్టదు. గతంలో ఎం.పి.గా ఉన్న సభ్యత్వం రద్దయిన పక్షంలో- ఆ సభ్యుడు తన మొత్తం పదవీకాలానికిగాను అందుకున్న జీతభత్యాలన్నింటినీ తిరిగి చెల్లించవలసి రావచ్చు. తద్వారా పరిస్థితి మరింత సంక్లిష్టంగా తయారవుతుంది. బహుశా ఈ తరహా సమస్యలను దృష్టిలో ఉంచుకొనే చట్టాన్ని పాత తేదీలనుంచి అమల్లోకొచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. కానీ ఇలాంటి చర్యలు ఏ మాత్రం సహేతుకం కాదు. న్యాయపరంగానూ వీటి చెల్లుబాటు ప్రశ్నార్థకం.

లాభదాయక పదవుల చట్టంలో హేతుబద్ధతను రాష్ట్రపతి ఆకాంక్షించారు. 1959నాటి చట్టం కింద అనేక పదవులను లాభదాయక జాబితాలోకి రాకుండా మినహాయించారు. ఇందుకు అర్థవంతమైన కారణాలనేవీ చూపలేదు. చట్ట సభల సభ్యుడెవరైనా మరో పదవిని చేపడితే- ఆ వెనువెంటనే దానిని కూడా మినహాయింపు జాబితాలోకి చేరుస్తూ వచ్చారు. ఈ క్రమంలో యాభైకిపైగా పదవులను మినహాయింపు జాబితాలో చేర్చేశారు. ఇక రాష్ట్రాలు రూపొందించిన చట్టాలనూ దీనికి జత కలిపితే- వందల సంఖ్యలో పదవులు మినహాయింపు పరిధిలోకి చేరుతాయి. తద్వారా రాజ్యాంగంలోని 102, 191 అధికరణాల స్ఫూర్తి దారుణంగా దెబ్బతింటుంది. లాభదాయక పదవులపై కేంద్ర, రాష్ట్రాలకు వర్తించే సమగ్ర చట్టం తీసుకురావాలన్న ప్రతిపాదన చర్చనీయాంశం. చట్ట సభలన్నింటికీ ఒకే తరహా విధివిధానాలను రూపొందించాల్సిన ఆవశ్యకత కొట్టిపారేయలేనిది. 191 అధికరణ ప్రకారం శాసనసభ్యులపై నిర్ణయం తీసుకునే అధికారం సంబంధిత రాష్ట్ర శాసనసభలకు మాత్రమే దఖలు పడింది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ శాసన సభ చట్టాన్ని తీసుకొచ్చి- జయాబచ్చన్‌ను అనర్హత వేటునుంచి తప్పించలేదు. అదే విధంగా రాష్ట్రాలకు చెందిన శాసన సభ్యులను అనర్హత వేటు నుంచి తప్పించడం పార్లమెంటు వల్లా కాదు.

రాష్ట్రపతి చర్యకు ప్రభుత్వం, పార్లమెంటు, రాజకీయ పార్టీలు ఏ విధంగా స్పందిస్తాయన్నది ప్రధానంగా చర్చించాల్సిన అంశం. ప్రభుత్వం వరస చూస్తుంటే పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేసుకొని దానిని తిరిగి రాష్ట్రపతికి పంపించాలనే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. అప్పుడు రాష్ట్రపతి తప్పనిసరిగా బిల్లును ఆమోదించాల్సి ఉంటుంది. బిల్లును వ్యతిరేకిస్తున్న విపక్షాలు... ముఖ్యంగా బి.జె.పి. ఈ అంశంలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించే అవకాశాలున్నాయి. మొదటి నుంచీ ఈ విషయంలో కాంగ్రెస్‌కు మద్దతునిస్తున్న లెఫ్ట్ పార్టీలు బిల్లుకు యథాతథంగా ఆమోదం తెలపవచ్చు. కానీ ప్రసారసాధనాల, ప్రజల అభిప్రాయం మాత్రం బిల్లుకు వ్యతిరేకంగానే ఉంది. రాష్ట్రపతి చర్యను చాలామంది హర్షిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం చక్రబంధంలో చిక్కుకుంది. బిల్లును ఇదే రూపంలో రాష్ట్రపతికి తిప్పి పంపితే ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుంది. తప్పుడు ప్రవర్తన కారణంగా పదకొండుగురు పార్లమెంటు సభ్యులను ఇటీవలే తొలగించారు. ఇప్పుడు తిరిగి మరో 40 మందిని పార్లమెంటునుంచి బయటకు సాగనంపడం- రాజకీయ సంక్షోభానికి దారితీయవచ్చు. ఈ కారణంవల్లే ఏదోవిధంగా బిల్లును చట్టరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తహతహలాడుతోంది.

వ్యవస్థల మధ్య అధికార విభజన; 102, 191 అధికరణల సమకాలీనత గురించిన చర్చ ఇప్పుడు తప్పనిసరి. పాలన వ్యవస్థ ప్రభావానికి, కుయుక్తులకు లొంగిపోని శక్తివంతమైన కవచం శాసనవ్యవస్థకు అవసరమని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. చట్టాలను చేయడం, బడ్జెట్‌ను ఆమోదించడం, ప్రభుత్వ విధానాలన్నింటినీ పర్యవేక్షించడం వంటివి శాసన వ్యవస్థ పరిధిలోని అంశాలే. చట్టాలను అమలు చేయడం, శాసనవ్యవస్థ ఆమోదం పొందిన అవసరాలకోసం ప్రజాధనాన్ని ఖర్చు చేయడం, విధి నిర్వహణలో శాసనవ్యవస్థకు బాధ్యత వహించడం వంటివి పాలన వ్యవస్థ నిర్వర్తించాల్సిన కార్యక్రమాలు. పాలన వ్యవస్థ చేతిలో చట్టసభల సభ్యులు కీలుబొమ్మలుగా మారిపోతే- శాసనవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతుంది. అది ప్రజాస్వామ్య పరిణతికి ఎంతమాత్రమూ సరికాదు. ఈ కోణంలో చూస్తే- లాభదాయక పదవులకు

సంబంధించి చట్టసభల సభ్యులపైన రాజ్యాంగపరమైన విధినిషేధాలు ఉండటం అవసరం. రాజ్యాంగబద్ధ ప్రభుత్వ భావన, వాస్తవంలో ఆ భావనను అమలు చేస్తున్న తీరు మన దేశంలో పరస్పర వైరుధ్యాలమయంగా ఉంది. సిద్ధాంతరీత్యా పాలనవ్యవస్థపై శాసనవ్యవస్థ అజమాయిషీ ఉంటుంది. కానీ నిజానికి జరుగుతున్నది అందుకు విరుద్ధం. చట్టసభలో మెజారిటీ ఉన్నంత కాలం ప్రభుత్వమే శాసనవ్యవస్థను నియంత్రిస్తోంది. సభలో మెజారిటీ నిలుపుకోవడమే ప్రభుత్వానికి కీలకం. మంత్రి మండలి ఏర్పాటులో రాజీపడటం, సభ్యులను సంతృప్తి పరచేందుకు వారికి వివిధ పదవులను కట్టబెట్టడం వంటివన్నీ- అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న గిమ్మిక్కులు. అవసరమున్నా లేకపోయినా మంత్రుల సంఖ్యను ఇబ్బడిముబ్బడిగా పెంచేయడానికి కారణమూ ఇదే. దిగువ సభలోని మొత్తం సభ్యుల్లో 15 శాతానికి మించి మంత్రివర్గ సభ్యుల సంఖ్య ఉండరాదని 91వ రాజ్యాంగ సవరణ ద్వారా నిబంధన తీసుకువచ్చారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శుల నియామకం, లాభదాయక పదవుల ద్వారా చట్టసభల సభ్యులను లోబరచుకునే ప్రయత్నాలు మెండుగా జరుగుతున్నాయి. అధికారాల విభజన సిద్ధాంతాన్ని గుండుగుత్తగా తప్పుదోవ పట్టించిన ఫలితమిది.

ఈ పరిస్థితుల్లో మొత్తంగా మన రాజకీయాల స్వభావాన్నే పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ఎం.పి.గానో, ఎం.ఎల్.ఎ.గానో ఎన్నికయితే తప్ప మంత్రి పదవి చేపట్టకూడదన్నది రాజ్యాంగ నియమం. ఒకవేళ ఎం.పి., ఎం.ఎల్.ఎ.లు కానివారు కూడా మంత్రులుగా నియమితమైతే ఆరునెలల్లోపు ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నికవ్వాల్సి ఉంటుంది. పాలన, శాసన వ్యవస్థలు మన దేశంలో ఒకదానితో మరొకటి కలగలిసిపోయాయి. ఈ కలయిక అవినీతికి దారితీస్తోంది. బ్రిటన్, జర్మనీ వంటి రాజకీయ పరిణతి సాధించిన దేశాల్లో ఈ కలయిక సామాజిక సంక్షేమానికి కారణమవుతోంది. కానీ ఇక్కడ మాత్రం అది ప్రజలను దోచుకోవడానికి మార్గమవుతోంది.

## విభజన రేఖ ఏదీ?

ప్రజాక్షేమమే పరమావధిగా మన రాజకీయాలను తీర్చిదిద్దాలంటే వ్యవస్థలో రెండు ప్రధానమైన మార్పులు రావాలి. శాసన, పాలన వ్యవస్థల మధ్య కచ్చితమైన విభజన రేఖ ఉండాలి. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో ఇలాంటి విభజన చాలా అవసరం. ముఖ్యమంత్రిని నేరుగా ఎన్నుకొనే పద్ధతి అమల్లోకి వస్తే ఇలాంటి అధికారాల విభజన సులభంగా సాధ్యమవుతుంది. రెండు; మన రాజకీయ సంస్కృతికి నాణ్యమైన మెరుగులు దిద్ది, మొత్తం రాజకీయాలకే సరికొత్త నిర్వచనం చెప్పుకోవాల్సి ఉంటుంది. ప్రజా సంక్షేమానికే అధికారంగానీ, వ్యక్తిగత కీర్తి ప్రతిష్ఠలకోసం కాదు అనే పరిస్థితిని సాకారం చేయాలి. ప్రభుత్వ పదవులు వారసత్వ సంపదగా మారిపోయిన దురవస్థ నేడు మనముందుంది. ఈ పరిస్థితి మారాలి. ప్రజాప్రతినిధులపట్ల వ్యవస్థలో అచంచల విశ్వాసం పాదుగొనాలి. మహాత్మాగాంధీ, అంబేద్కర్‌ల కాలంనాటి రాజకీయ విలువల కోసం కాగడా పెట్టి వెదకాల్సి వస్తోంది. ఆనాటి మహోన్నత రాజకీయ విలువలను తిరిగి మేల్కొల్పాల్సిన అవసరం నేడు మనముందుంది. ఆ సుందర స్వప్నం సాధ్యం కానంతవరకూ- 'లాభదాయక పదవులు' వంటి అనేకానేక అంశాలపై చేసే ఎన్ని చర్చలైనా కేవలం సాంకేతికపరమైనవిగా, పండిత చర్చలుగానే మిగిలిపోతాయి. అలాంటి చర్చలు జనహృదయాలను స్పందింపజేయలేవు, ప్రజల జీవితాలను మార్చలేవు, రాజకీయాలను సంస్కరించలేవు.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)